# జ్ఞానోదయం

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి B. Sc.

ఒకప్పుడు వివేకానందస్వామి రాజస్థాన్ ప్రాంతాన్ని సందర్శించడం జరిగింది. ఆ దేశాన్ని పాలిస్తున్న 'ఆళ్వార్' మహారాజు మనస్తత్వం వివేకానందస్వామిని ఆశ్చర్యచకితుని చేసింది.

ఆళ్వార్ మహారాజు భోగలాలసుడు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను విడనాడి పాశ్చాత్య నాగరికతను అలవరచుకున్నాడు. విగ్రహారాధన అంటే యాతనికి గిట్టదు.

"భగవంతుడనే వాడుంటే మనస్సులో ధ్యానించి పూజించుకోవచ్చుగాని, నిర్జీవమైన రాతి విగ్రహాలను ఆరాధించడం కేవలం అవివేకం" అని వాదించేవాడు.

వివేకానందస్వామి యీతని విచిత్ర ప్రవృత్తిని గమనించి తగురీతిని గుణపాఠం నేర్పాలనే సంకల్పంతో రాజును సందర్శించేడు.

ఆళ్వార్ మహారాజు స్వామిని ఉచిత రీతిని సన్మానించేడు.

"రాజా! పరమేశ్వరుడు మిమ్ము సర్వదా కాపాడుగాక!" అంటూ ఒక చిన్న విగ్రహాన్ని అతని చేతికి అందివ్వబోయాడు.

రాజు స్వీకరించలేదు.

"క్షమించాలి నేను విగ్రహారాధకుణ్ణి కాను" అంటూ తన వ్యతిరేకతను వ్యక్తపరచేడు.

"అదేమిటి రాజా! దైవాన్ని నిందించడం దోషంకదూ?" అన్నాడు వివేకానందుడు.

"భగవంతుడనే వాడికి యిన్ని రూపాలు, యిన్ని వేషాలు ఎందుకు? సద్భావంతో మనస్సులోనే ఆ దైవాన్ని ఆరాధించుకోవచ్చు కానీ మధ్యలో యీ నిర్జీవమైన శిలా ప్రతిమలెందుకు?"

"అక్కడే పొరపడుతున్నావు రాజా! ఎదుట ఏవస్తువూ లేకుండా, దానిపై నిర్మల హృదయంతో మనస్సును లగ్నం చేయడానికి సాధ్య పడదు. కావుననే మధ్యగా భగవంతుని ఊహారూప ప్రతిమలపైనే దృష్టి కేంద్రీకరించి దైవాన్ని ఆరాధించుకుంటున్నాము. విగ్రహారాధనను కాదంటే దేవునినికూడా కాదన్నట్టే!" అని బోధించేరు. కానీ రాజు మనస్సు మారలేదు.

[redacted] స్వామికి ఒక చిన్న ఉపాయం తట్టింది. వెంటనే ఆ ఆస్థానంలో గోడకు తగిలించ బడిన రాజు బొమ్మను ఊడబెరికి, క్రింద పారేశి, దానిని త్రొక్కుతూ ఉమ్మేశాడు. ఈ అఘాయిత్యాన్ని చూస్తూ రాజు నిశ్చేష్టుడై పోయాడు.

తన ఎదుటగా తన విగ్రహాన్ని అవ మానిస్తున్నాడు. రాజుకు కోపం ఆగింది కాదు.

"అదేమి వైపరీత్యం స్వామీ! నా ఎదుటగా నా విగ్రహాన్ని అవమానిస్తు న్నారా?" అన్నాడు ఆగ్రహంతో

"ఆ బొమ్మ మీదైనా, మరెవరిదైనా అదొక నిర్జీవమైనవస్తువు. దాని మీద మీ కెందుకంత మక్కువ? ఆ చిత్రం మీదై నంత మాత్రాన దానిని గౌరవించాలా? మిమ్మల్ని గౌరవించాలన్నా, పూజించా లన్నా, మనస్సులోనే ఊహించుకుని గౌర వించుకోవచ్చుగా! మధ్యలో యీనిర్జీవ మైన చిత్రం ఎందుకు? విగ్రహారాధనకు వ్యతిరేకులైన మీకు యిది వ్యతిరేకం కాదా?" అన్నాడు.

దానితో రాజుకు జ్ఞానోదయం కలిగింది. వెంటనే స్వామి పాదాలను కౌగలించుకుని "నా తప్పులను క్షమించండి. నా మనస్సు మారింది" అంటూ వేడుకున్నాడు.


మెదడును చల్లబరచి

శిరోజములను నల్లబరచి

కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.